## 'రాజీవ్ యువవికాస్'కు
# దరఖాస్తు చేసుకోండి
### కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, ఏప్రిల్ 1: రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 14 వరకు కార్పొరేషన్‌లోని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అందుకోసం ఆధార్ కార్డు, కుల , ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, లేదా ఆహార భద్రతా కార్డు, దివ్యాంగులు ఉంటే వికలాంగుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. అదేవిధంగా విద్యార్హతలు, ట్రైనింగ్ పొందిన ధ్రువీకరణ పత్రం, రవాణా విభాగం కోసం డ్రైవింగ్ లైసెన్స్ ను తప్పనిసరిగా జతపరచి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## మహనీయుల జయంతులను
# ఘనంగా నిర్వహించాలి

హిమాయత్‌నగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 1: మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రజలకు పిలుపు నిచ్చారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5న మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్ రామ్,11న మహాత్మాజ్యోతిరావుపూలే,14న డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ జయంతి కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. దేశం కోసం, జాతి జనుల కోసం తమ మేధస్సును అంకితం చేసిన ఆ మహనీయుల స్ఫూర్తిని నేటి తరం యువతకు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శులు బొడ్డుపల్లి కృష్ణ, చింతకింది కుమార స్వామిలు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి కృషి

కాచిగూడ : డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య అన్నారు. కృష్ణనగర్‌లో ఉన్న మట్టికుప్పలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయగా.. స్పం దించిన కార్పొరేటర్ మంగళవారం జీహెచ్ఎంసీ సిబ్బందితో కుప్పలను శుభ్రం చేయించారు.

# డోర్లు మాయం..కట్టెలు అడ్డం

- కాటేదాన్, ఉడ్డెంగడ్డలో ఉన్న
- మరుగుదొడ్ల పరిస్థితి దారుణం
- పట్టించుకోని అధికారులు.. ప్రజాప్రతినిధులు
- అవస్థలు పడుతున్న పలువురు

కాటేదాన్ ప్రాంతంలో జీహెచ్ఎంసీ పబ్లిక్ టాయిలెట్స్‌కు డోర్స్ లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 1: ప్రజలకు ఉపయోగపడాల్సిన పబ్లిక్ టాయిలెట్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో అన్ని సరిగ్గా ఉన్నా కూడా స్థానిక వ్యాపారుల అతి ఉత్సాహం వల్ల వాటిని ప్రజలు ఉపయోగించలేకపోతున్నారు. పబ్లిక్ టాయిలెట్స్ ముందు వ్యాపార సముదాయాలను పెట్టుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. పాడైన వాటిని బాగు చేయడంలో, మంచిగా ఉన్నా వాటిని ఉపయోగంలో ఉంచడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణను పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కాటేదాన్, ఉడ్డెంగడ్డ ప్రాంతాల్లో టాయిలెట్స్‌ను నిర్మించి అధికారులు చేతులు దులుపుకున్నారు. ప్రజల ఉపయోగం కోసం నిర్మించి వాటిని సక్రమంగా నిర్వహించకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. జీహెచ్ఎంసీ పబ్లిక్ టాయిలెట్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో పాటు అందులో ఉన్న సామగ్రిని ఎత్తుకెళ్లారు. అయినా అధికారుల్లో కనీసం చలనం లేకపోవడం చాలా బాధాకరం. వీటి నిర్వహణపై స్థానిక ప్రజలు జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఏ ఒక్కరూ స్పందించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### పబ్లిక్ టాయిలెట్స్‌కు అడ్డం పెట్టిన కట్టెలు

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉడ్డెంగడ్డ కల్లు కాంపౌండ్ ప్రాంతంలో జీహెచ్ఎంసీ అధికారులు పబ్లిక్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ వాటిని ప్రజలు ఉపయోగించే వీలు లేకుండా పక్కనే ఉన్న ఓ వ్యాపారస్తుడు తన సామగ్రిని టాయిలెట్స్ డోర్స్ ముందు ఏర్పాటు చేశారు. ఈ పబ్లిక్ టాయిలెట్స్‌కు రోడ్డు, వాటర్ ట్యాంక్ అన్ని సరిగ్గా ఉన్నా కూడా వ్యాపారస్తుడి నిర్వాహకం వల్ల ప్రజలకు ఉపయోగలేదు. వాహనదారులు, పాదచారులు అనేక మంది ఈ దారి గూండా ప్రయాణిస్తుంటారు. ఈ పబ్లిక్ టాయిలెట్‌లోకి వెళ్లేందుకు వీలు లేకపోవడంతో మిన్నకుండిపోతున్నారు. పబ్లిక్ టాయిలెట్స్ ముందు వ్యాపార సముదాయాలు ఎందుకు పెడుతున్నామని ప్రశ్నించే వారిపై దురుసుగా ప్రవరిస్తున్నారని స్థానికులు వెల్లడిస్తున్నారు.

### టెండర్లు పిలిచి అభివృద్ధి పరుస్తాం

శిథిలావస్థకు చేరిన పబ్లిక్ టాయిలెట్స్‌ను అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే తమ పరిధిలోని అన్ని పబ్లిక్ టాయిలెట్స్‌ల నిర్వహణపై చొరవ తీసుకుంటున్నాం. ఏప్రిల్ నెలలో కొత్త టెండర్లను పిలిచి శిథిలావస్థలో ఉన్న వాటిని ఆధునీకరిస్తాం.అదేవిధంగా టాయ్‌లెట్స్ లోపలికి వెళ్లకుండా కట్టెలు, సామగ్రి పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటాం.

*– రవికుమార్, -రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్*

ఉడ్డెంగడ్డ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ డోర్ ముందు వ్యాపార సముదాయాన్ని ఏర్పాటు చేసిన దృశ్యం.

# సేవతోనే..సమాజంలో గుర్తింపు
### సినీనటుడు సుమన్

ఖైరతాబాద్, ఏప్రిల్ 1: సామాజిక సేవలు సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని సినీనటుడు సుమన్ అన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త, తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు చింతల మల్లేశం గౌడ్ సేవలను గుర్తిస్తూ జర్మనీ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీనటుడు సుమన్ మల్లేశం గౌడ్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్లేశంగౌడ్ ఎందరో పేద విద్యార్థులకు విద్యాదానం చేశారని, విదేశీ విద్య కోసం ఆర్థిక సాయం అందించారన్నారు. రాష్ట్రంలో సుమారు 50 సర్దార్ సర్వాయి పాపన విగ్రహాలను ప్రతిష్టించారని, శ్రీశైలం, యాదాద్రిలో భక్తుల కోసం సత్రాలు నిర్మించారని తెలిపారు. జీవితాన్ని సమాజానికి అంకితం చేసిన వారిని సత్కరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పంజాల శ్రవణ్ గౌడ్, బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లేశం గౌడ్‌ను సత్కరిస్తున్న సినీనటుడు సుమన్

### ఊరికి వెళ్లి వచ్చేసరికి...

ఖైరతాబాద్, ఏప్రిల్ 1 : ఓ శుభకార్యం కోసం కుటుంబంతో సహా కలిసి ఊరికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంట్లో దాచిన బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఈ ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... అమీర్పేటలో నివాసం ఉండే రాగాల వినీత, ప్రశాంత్ దంపతులు జనవరి 24న కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ వెళ్లారు. ఆ సమయంలో నగలను ఓ డబ్బాలో ఉంచి కప్‌బోర్డులో భద్రపరిచింది. గత నెల 7న తిరిగి ఇంటికి చేరుకున్నారు. గత నెల 31న ఇంట్లో సదురు కప్‌బోర్డును తెరిచి చూడగా అందులో భద్రపరిచిన ఆభరణాలు కనిపించలేదు. వాటిని పనిమనిషి మాధవి తస్కరించినట్లు అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# క్రమంగా తాగునీటిని సరఫరా చేయాలి

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, ఏప్రిల్ 1 : మణికొండ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న 'గుడ్ మార్నింగ్ మణికొండ' ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ పార్క్, తులిప్ గార్డెన్ కాలనీలలోని మంగళవారం బీఆర్ఎస్ నాయకులు పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు అనేక సమస్యలను నాయకులు దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. చట్ట విరుద్ధంగా గత సంవత్సరం డిసెంబర్‌లో తెలంగాణ మున్సిపాలిటీ అధికారులు ప్రజలకు చెప్పా పెట్టకుండా ఆస్తి పన్ను పెంచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కొంత మందికే పెంచి, నేటి నుంచి మొదలయ్యే ఈ సంవత్సరం అందరికీ పెంచుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంపై మణికొండ మున్సిపాలిటీ ఒక ప్రకటన చేయాలని బీఆర్ఎస్ పార్టీ గట్టిగా డిమాండ్ చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. అదేవిధంగా మంచినీటి కొరత తీవ్రంగా ఉన్నదని అందుకు తోడు జలమండలి వాటర్ లైన్లను అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసి నీటి సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, కుంభగల్ల ధనరాజ్, బుద్దోలు బాబు, శ్రీనివాస్ చారి, అందే లక్ష్మణ్ రావు, గోరుకంటి విఠల్, బండమీది మల్లేష్, ఉపేందర్‌నాథ్‌రెడ్డి, సంఘం శ్రీకాంత్, రాజేంద్ర ప్రసాద్, దిలీప్, బొడ్డు శ్రీధర్, సుమనళిని తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలి

హిమాయత్ నగర్ లోని పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ స్వరూప్

హిమాయత్ నగర్ , ఏప్రిల్ 1: ప్రముఖ క్రైస్తవ బోధకుడు, పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్ర వరం శివారు కొంతమూరు వద్ద మార్చి 24న ప్రవీణ్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం సక్రమంగా జరగదని, రీ పోస్టుమార్టం నిర్వహించాలన్నారు. ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో చనిపోలేదని ముమ్మా టికి ప్రణాళికతోనే సంఘ్ పరివార్ సంస్థలకు చెందిన వారే హత్య చేశారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రైస్తవులు, నిమ్నజాతులపై దాడులు, హత్యలు పరంపర కొనసాగుతున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ గోలి నరేష్, మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు అల్లం సురేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,నేతలు సుబ్బారావు, మద్దెల ప్రవీణ్ కుమార్, పి.సుచంద్ర రావు పాల్గొన్నారు.

### అలరించిన సత్య హరిశ్చంద్ర నాటకం

*ఫిలింనగర్‌లోని రామానాయుడు కళామండపంలో పొత్తూరు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్య నాటకోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం హైదరాబాద్ సురభి కళా నాట్యమండలి ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఆహుతులను ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీబీ మాజీ డీజీ పూర్ణచందర్‌రావు హాజరయ్యారు. హరిశ్చంద్రుడిగా దేవనాథ్ సూరి, సురభి నిఖిలేష్, చంద్రమతిగా లక్ష్మీశ్రీ, నక్షత్రకుడిగా దుర్గాప్రసాద్ ప్రధాన పాత్రల్లో ఆకట్టుకున్నారు. అనంతరం ఫీనిక్స్ ఫౌండేషన్ చైర్మన్ చుక్కపల్లి సురేష్ కళాకారులను అభినందించారు. – బంజారాహిల్స్,ఏప్రిల్ 1*

# మంత్రివర్గ విస్తరణలో .. మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న కిష్టయ్య

ఖైరతాబాద్, ఏప్రిల్ 1 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మార్పీఎస్ నేత పల్లె కిష్టయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30లక్షలకు పైగా జనాభా కలిగిన మాదిగలకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. కనీసం నాలుగు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభాకర్, చంద్రకిరణ్, లక్ష్మయ్య, భాస్కర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గోల్నాక : అంబర్‌పేట డివిజన్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రేమ్‌నగర్, ఓల్డేజ్ హోం బస్తీలో లోప్రెషర్ ఇబ్బందులున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం సంబంధిత అధికారులతో కార్పొరేటర్ మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంతోషిచారి, వాసులు పార్వతి, సుగుణ, మంజుల, రజిని, చిట్టి, అశ్విని, పద్మ, ప్రియాంక, శివ, నారాయణ, సూరి పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీ కాలనీలో ఉన్న రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం. చిత్రంలో మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ (బండ్లగూడ, ఏప్రిల్ 1)

మణికొండ, ఏప్రిల్ 1 : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకం మణికొండ నార్సింగి మున్సిపాలిటీలలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నార్సింగి మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ మంచిరేవులలో రేషన్ వద్ద ప్రారంభించారు. అదేవిధంగా ఖానాపురం గ్రామంలోని రేషన్ దుకాణంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, మాజీ సర్పంచ్ నరసింహ తదితరులు పాల్గొని సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపి రెడ్డి, మాజీ సర్పంచ్ పేరడి సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ మేకల ప్రవీణ్ యాదవ్, నార్సింగి మార్కెట్ వైస్ చైర్మన్ దశరథ్ యాదవ్ , మాజీ వార్డు సభ్యులు దొబ్బ లక్ష్మణ్ , పిట్టగాళ్ళ మాణిక్యం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడుపద్దు

కాచిగూడ : మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఏ శ్రీనివాస్ హెచ్చరించారు. నింబోలిఅడ్డాలో వాటర్ ట్యాంకర్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా మంగళవారం హర్రస్ పెంటకు చెందిన ప్రతీక్ సోన్ కాంబ్లెను తనిఖీ చేయగా పరిమితికి మించి ఆల్కహాల్ తాగి పట్టుబడ్డాడు. ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనాలు నడప రాదని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్సై అనిల్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# పాదచారుల ప్రాణాలకు రక్షణ కరువు

- ఫుట్‌పాత్ రెయిలింగ్‌ను తొలగిస్తున్న హైదరాబాద్ మెట్రోరైల్ సిబ్బంది
- నిధులు లేకపోవడంతో ఇక్కడినుంచి వేరేచోటకు తరలిస్తున్నట్లు విచిత్ర సమాధానం

ఎవీస్ దవాఖాన ముందు రెయిలింగ్స్ కట్ చేసిన దృశ్యం

బంజారాహిల్స్, ఏప్రిల్ 1: హైదరాబాద్ నగరంలో పాదచారుల ప్రాణాలను గాలికి వదిలేస్తున్నారంటూ పలుమార్లు న్యాయస్థానాలు మందలిస్తున్నా .. జీహెచ్ఎంసీకి చీమకుట్టినట్లైనా లేదు. ఫుట్‌పాత్‌ల నిర్వహణను గాలికి వదిలేసిన జీహెచ్ఎంసీకి హైదరాబాద్ మెట్రోరైల్ కూడా తోడైందా.. అంటే అవును అనే సమాధానం వినిపిస్తోంది. మెట్రోరైల్ మార్గాల్లో ఫుట్‌పాత్‌లను నిర్మించిన హైదరాబాద్ మెట్రోరైల్ క్రమక్రమంగా వాటి నిర్వహణను పూర్తిగా విస్మరించింది. తాజాగా ప్రధాన రోడ్లపై ఫుట్‌పాత్‌లకు రక్షణగా నిర్మించిన రెయిలింగ్స్‌ను తొలగిస్తోంది.

- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 5 మెట్రోస్టేషన్‌కు మధ్య గతంలో హైదరాబాద్ మెట్రోరైల్ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్ మీద పటిష్టమైన రెయిలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. విపరీతమైన వాహనాల రద్దీ ఉండే ఈ రోడ్డుపై నడవడం ప్రాణాలకు ప్రమాదంగా ఉండడంతో ఫుట్‌పాత్‌పై నడుస్తుంటారు. దీనికి తోడు రక్షణగా రెయిలింగ్, గ్రిల్స్ ఏర్పాటు ద్వారా ఫుట్‌పాత్ ఆక్రమణలు కాకుండా చూస్తున్నారు.
- కొంతమంది భవన నిర్మాణదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ఫుట్‌పాత్‌ల మీద ఏర్పాటు చేసిన రెయిలింగ్స్‌ను తొలగించేందుకు హైదరాబాద్ మెట్రోరైల్ సిబ్బంది ప్రణాళికలు రచిస్తున్నారు.
- దీనిలో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్1లోని ఫుట్‌పాత్ రెయిలింగ్స్‌ను మంగళవారం తొలగించారు. ఈ విషయంపై హైదరాబాద్ మెట్రోరైల్‌లోని ఇంజినీరింగ్ విభాగం అధికారి రాజీవ్‌రెడ్డిని వివరణ కోరగా విచిత్రమైన సమాధానం ఇచ్చారు.
- మెట్రోస్టేషన్ సమీపంలో 300 మీటర్లు మాత్రమే తమ బాధ్యత అని, మిగిలిన ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లు జీహెచ్ఎంసీకి అప్పగించామన్నారు. గతంలో వేసిన రెయిలింగ్స్ తొలగింపు వల్ల పాదచారులకు ఇబ్బందులు ఉంటాయని తెలపగా, వేరే ప్రాంతాల్లో రెయిలింగ్ అవసరమైనప్పుడు కొత్త రెయిలింగ్ కోసం నిధులు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న వాటిని తొలగించి అక్కడకు మారుస్తామంటూ చెప్పారు. జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగి ఫుట్‌పాత్‌లపై రెయిలింగ్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## వ్యక్తిపై కత్తితో దాడి

బంజారాహిల్స్,ఏప్రిల్ 1: అకారణంగా వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లోని ఉదయ్‌నగర్‌లో నివాసం ఉంటున్న దీపక్ దాస్(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో పార్థసారథి అనే వ్యక్తితో కలిసి మంగళవారం వైరింగ్ పనులు చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి అక్కడకు వచ్చాడు. మూడో ఫ్లోర్‌లో పని కోసం వచ్చానంటూ చెప్పిన గుర్తుతెలియని వ్యక్తి కాసేపు అక్కడే నిలబడి న్యూసెన్స్ చేయడం ప్రారంభించాడు. దీంతో బయటకు వెళ్లిపోవాలంటూ దీపక్‌దాస్ తోపాటు పార్థసారథి సూచించారు. అయితే బయటకు వెళ్లిపోకపోవడంతో పాటు అకారణంగా గొడవకు దిగాడు. దీంతో మాటామాటా పెరగడంతో పాటు తనతో తెచ్చుకున్న కత్తితో పార్థసారథి మీద దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో పార్థసారథి చేతికి గాయాలయ్యాయి. దీంతో గట్టిగా కేకలు వేయడంతో ఆగంతకుడు పారిపోయాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ప్రారంభమైన ఎర్లీ బర్డ్

బండ్లగూడ, ఏప్రిల్ 1. రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ పరిధిలో 2025 -2026 ఆర్థిక సంవత్సరానికి ఎర్లీ బర్డ్ పథకం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి 30 వరకు ముందస్తు ఆస్తిపన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీని ప్రభుత్వం కల్పిస్తుంది. ఈ పథకంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరానికి ఐదు శాతం రాయితీతో తమ ఆస్తి పన్ను చెల్లించవలసిందిగా రవికుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఆస్తి పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇదిలా ఉంటే 2024 -2025 ఆర్థిక సంవత్సరానికి డిమాండ్ రూ. 54 కోట్లు ఉండగా రూ.53 కోట్ల 34 లక్షలు ఆస్తి పన్ను వసూలు చేశామన్నారు.

### యూసుఫ్‌గూడ సర్కిల్ పరిధిలో..

జూబ్లీహిల్స్: వార్డుల పురోభివృద్ధికి.. సర్కిల్ సమగ్రాభివృద్ధికి చేపట్టిన ఆస్తిపన్ను స్పెషల్ డ్రైవ్ సోమవారంతో ముగిసింది. యూసుఫ్‌గూడ సర్కిల్ లో 2024-25 సంవత్సరానికి రూ.36.47 కోట్ల లక్ష్యంగా వసూలు చేపట్టిన జీహెచ్ఎంసీ అధికారులు ఎట్టకేలకు 90 శాతం ఆస్తిపన్ను వసూలు చేశారు. కాగా నేటి నుంచి 2025_26 ఆస్తిపన్ను చెల్లింపుల ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ నెలలో ఆస్తిపన్ను చెల్లించిన వారికి బల్దియా 5 శాతం రాయితీతో ఎప్పటిలాగే.. ఈ ఆఫర్ ప్రకటించింది.



### ఫిర్యాదు చేసినా..స్పందించరా...!

*యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీ కృష్ణానగర్ ఎఫ్ బ్లాక్ ప్రాంతంలో అప్పటికే కుంగి ఉన్న మ్యాన్ హోల్ పై భారీ లోడ్‌తో వచ్చిన లారీ దిగబడడంతో అది కాస్తా పూర్తిగా లోపలికి దిగిపోయింది. దీంతో గత పక్షం రోజులుగా స్థానికులు, వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. రాత్రి పూట ఈ సమస్య మరింత తీవ్రంగా వుండడంతో జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామని.. అయితే నేటికీ సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు పవన్, విశాల్, అభిషేక్ తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.*

*– జూబ్లీహిల్స్,ఏప్రిల్ 1:*

## తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటాం

సికింద్రాబాద్, ఏప్రిల్1 : తెలంగాణ ఉద్యమకారులకు తాము అండగా నిలుస్తామని ఉద్యమ నాయకుడిగా తనకు పూర్తి అవగాహన ఉందని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశం ఉద్యమకారులకు 250 గజాల స్థలం 25 వేల పెన్షన్స్ సౌకర్యం తోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండు తో ఏప్రిల్ 21న జరగబోయే ప్లీనరీ సమావేశానికి సంబంధించిన పోస్టర్ రిలీజ్ కార్యక్రమం మంగళవారం ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లూరి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సీ తాఫల్ మండి లో జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మారావు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యులు జానకి రెడ్డి, రాం బాబు దయానంద్ గంగపుత్ర , జగన్ యా దవ్ ఆర్కే భూపాల్, లక్ష్మణ్, నరసింహ చారి, అమర్, సత్తన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలి
### వడ్డెర సంఘం లక్ష్యసాధన రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రాజు

చిక్కడపల్లి, ఏప్రిల్ 1: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని వడ్డెర సంఘం లక్ష్యసాధన రాష్ట్ర అధ్యక్షుడు జరిపిటి సత్యనారాయణ రాజు, వడ్డెర